# తొలిచావు

సురమౌళి



ఇల్లు దగ్గరికి చేరినకొద్దీ రాముకు ఎగపోత ఎక్కువ కాసాగింది. ఉరకడం లేదుగాని వేగంగా నడుస్తున్నాడు తాను. సందంతా కలియజూశాడు.. నిశ్శబ్దంగా వుంది. మెట్లు మీదికెక్కి తలుపుకు చెవిపెట్టి విని చూశాడు. లోపల కూడా నిశ్శబ్దంగానే వుంది. అంటే ముందు వాకిట్లోగాని, దాని వెనకాలే వున్న వరండాలోగానీ ఎవరూ లేరన్నమాట. వాకిలికి ఆనుకుని వున్న దొడ్లో మాత్రం ఎవరో వున్నట్లే వుంది. దొడ్డిలో నుంచి బయటికి వున్న మోరీ గుండా నీళ్లు సందులో పడుతూ వున్నాయి.

మెల్లగా తలుపు తీసికొని లోపలికి చేరాడు. ద్వారం ముందు వీధిలో వున్న వేపచెట్టు మీది నుంచి ఏదో పక్షి రెక్కలు చప్పుడు చేసుకుంటూ ఎగిరిపోయింది. దొడ్డి తలుపు తెరచిన అలికిడైంది. తెరచిన తలుపు చాటుకు దాక్కున్నాడు రాము. మెల్లగా వంగి చూశాడు. పెద్దన్నయ్య ఓ చేత్తో చెంబు, మరో చేత్తో నడుము దగ్గర లుంగీ సర్దుకుంటూ వరండా వైపుకు వెళ్తున్నాడు. వెళ్లేవాడల్లా చటుక్కున ఆగి ద్వారంవేపు చూశాడు. చూస్తూనే "నమస్కార ముండోయ్!" అన్నాడు పెద్దగా. సందు గుండా వెళ్తున్న ఒకాయన "నమస్కారం—నమస్కారం" అంటూ సాగిపోయాడు పక్కింటి సొట్టిమామయ్య కామాల్ను. "తలుపుల వెనుక ఎందుకురా ఎప్పుడూ అలా నక్కుతావు?" అంటూ వుంటాడు ఎప్పుడూను. ఇంతలో అన్నయ్య పిలుపు విని ఉలిక్కిపడ్డాడు. "అరె..తాను తలుపు చాటుకు దాక్కున్నాడు గదా! అన్నయ్య కెలా తెలిసిందబ్బా!" అని రాముకు బోలెడు ఆశ్చర్యం వేసింది. తలుపును బాగా పరికించి చూశాడు. చెక్కలు నేలదాకా లేవన్నమాట! అడుగు నుంచి తాను వేసుకున్న కొత్త చెప్పులు కనపడుతున్నాయన్నమాట!

"దాగుడుమూతా దండాకోర్ ." అంటూ తలుపు చాటునుంచి బయటికి వెళ్లాడు

"దాగుడు మూత లాడుతున్నా వనుకోవాలి కాబోలు!" పెద్దన్నయ్య తన్ను పరిశీలనగా చూస్తూ ప్రశ్నించాడు.

"మరి...?"

"వెళ్లి ఓసారి అద్దంలో ముఖం చూసుకురా! ఎలా పాలిపోయిందో! భయంతో కంపించిపోతున్నట్టు!"

"నాదా!"

"లేక నాదా?"

"నా కెందుకూ భయం? నేనేమన్నా దొంగతనం చేశానేమిటి? ఆడుకుంటున్నాగా!" ధైర్యంగా అనేశాడు రాము. దానితో రాము ముఖం మీద అంత వరకూ ఏమన్నా భయకంపితమైన రేఖలు ఉండుంటే అవి మటుమాయమై ఒక్కసారి ఆత్మవిశ్వాసపు ఛాయ మెరిసింది.

"ఏదో చిలిపితనం చేసే వుంటావు! పద అమ్మ దగ్గరకు!" పెద్దన్నయ్య గద్దించాడు. గద్దిస్తూ రాము తొడుక్కున్న చొక్కా ఎడమచేతిని పుచ్చుకున్నాడు.

"ఆ! నే రానుపో!" అంటూ చేతిని విదిలించుకున్నాడు రాము.

"అల్లాగేం! ఉండు చెపుతా!..ఇప్పుడే వెళ్లి అమ్మతో చెపుతానుండు!"

"చెప్పుకో పో" రాము ఆత్మవిశ్వాసంతో అనేశాడు. పెద్దన్నయ్య చెంబులో మిగిలిన నీటిని నేల మీద గీతపడేలా ధారగా పోసుకుంటూ వరండా దాటేసి ఇంట్లోకి ప్రవేశించాడు.

"చూడమ్మా!" అంటూ ప్రారంభించాడు.

"ఎందుకురా అలా గొంతు చించుకుంటావు? చెప్పేదేమిటో దగ్గరదాకా వచ్చి చెప్పరాదూ!" అని అమ్మ గద్దించింది. "అమ్మ గద్దించినప్పుడు చూడాలి పెద్దన్నయ్య ముఖం. పెద్ద...అమ్మతో చెపుతానుండు అని బెదిరించాడు. చెప్పుకోనీ తనకేమన్నా భయమా! తానెవరికీ భయపడడు. నాన్నక్కూడా భయపడడు!"

సందు చివరి మలుపు నుంచి మనుషుల కేకలు వినిపించసాగాయి. తానిందాకా ఆడుకున్న శ్మశానం అటు వేపే ఉన్నది. రాము గబుక్కున వెళ్లి తలుపులు మూసేశాడు. అక్కడ వేపచెట్టు నీడన వాకిట్లో వాల్చి ఉన్న మంచం పట్టె మీద కూచుని ఆలోచనలో పడ్డాడు. కేకలు క్రమంగా సమీపిస్తున్నాయి. తాను శ్మశానంలో వదిలేసి వచ్చిన జనమంతా తన మీద విరుచుకుపడటానికి వస్తున్నారన్నమాట. రానీ, తనకేమన్నా భయమా! తాను చేసింది తప్పేం తేగా! లేకపోతే ఆ వెధవ....

"అయ్యగారూ!" అరిచాడు చాడీకోరు కుంకే.

"అయ్యగారండీ!" మరో గొంతు.

"అయ్యగారు లేరు!" రాము గట్టిగా సమాధానం చెప్పాడు.

"అయ్యగారూ!" మళ్లీ అదే పిలుపు.

"అయ్యగారూ, అయ్యగారూ! అయ్యగారూ!... పెద్ద... అప్పుడు గుర్తుకు రాలేదేం అయ్యగారు? ఇప్పుడొచ్చారూ! అయ్యగారితో చాడీలు చెప్పడానికి." తనలో తానే విసుక్కుని "అయ్యగారు లేరంటున్నాగా!" బాగా వినపడేట్టు పెద్దగా అన్నాడు రాము.

"తలుపు తియ్యండి బాబూ!" అని మళ్లీ పిలుపు. ఇది రాజుగాడి గొంతు గోతులు తవ్వడం, బిచ్చమెత్తుకోవడం, డబ్బు కొట్టడం వాడి వంతు. పైగా పేరుకు మాత్రం 'రాజు'

"వెళ్లండ్రా తలుపు తియ్యను!"

"గొళ్లెం చప్పుడు చెయ్యండోయ్!" ఎవడిదో బోడి సలహా, వెంటనే దానిపైన అమలు కూడాను. గొళ్లేన్ని తలుపు కేసి ఆగకుండా కొడుతున్నారు గుళ్లో గంటలు కొట్టినట్టు. మంచం మీదినుంచి లేచి రాము తలుపు దగ్గరగా వెళ్లి "వెళ్తారా లేదా!" అని గట్టిగా గద్దించాడు రాము.

"మేం నీ కోస మొచ్చామేంటి?... అయ్యగారి కోసం వచ్చాం! నీకేం!"

గొళ్లెం చప్పుడెక్కువైంది. కేకలు కూడా ఎక్కు

అని చెప్పింది. పెద్దన్నయ్య ఐదు రూపాయల నోటు తీసుకొని వచ్చి అయిలుగాడి చేతిలో పెట్టాడు బిచ్చపు కుర్రాళ్లు వంగి నమస్కారం చేస్తూ "చాలా తక్కువండి అమ్మగారూ! ఈ రోజుల్లో ఐదు రూపాయల కేమొస్తుందండీ! పదిరూపాయలన్నా అయితే ఎలాగో సర్దుకోవచ్చు!" అని ప్రాధేయ పడసాగారు కాని వాళ్లదేమీ సాగలేదు. చివరకి ఆరు రూపాయలు తీసుకొని యానాది కుర్రాళ్లంతా వెళ్లిపోయారు.

"నువ్వెక్కడికిరా! ఆగు!" అని అమ్మ గద్దించే సరికి రాము వెనక్కితిరిగి చూశాడు. ఎక్కడికో పారిపోవడంలేదు తాను. పెద్దన్నయ్య తలుపులు మూసేసి గొళ్లెం పెట్టేసిం తర్వాత, వరండాలో పెద్దమంచం మీద కూచుని మూలుగుతూ వున్న నాయనమ్మ గుర్తు కొచ్చింది రాముకు. నాయనమ్మ దగ్గర కెళ్లి కూచోవడమంటే రాముకు చాలా సరదా. ఇంట్లో అందరూ తన్ను కోప్పడ్డప్పుడు రాము వెళ్లి నాయనమ్మదగ్గరే కూచుని ఊరట చెందేవాడు. కన్నీళ్లు తుడవడం కన్నా నాయనమ్మ ఇలాంటి సమయాల్లో తనకే విధంగానూ సాయపడజాలదని రాముకు కూడా తెలుసు. నాయనమ్మ కూడా నాన్నకు భయపడుతుంది. నాయనమ్మ గుర్తుకు రాగానే రాము కాళ్లు వాటంతట అవే వరండా వేపుకు దారి తీశాయి.

అమ్మ వచ్చి రాము చెవి పట్టుకుని మెలేస్తూ అడిగింది.

"ఎందుకురా నువ్వువాడి తల పగులగొట్టింది?" అని.

"చెప్పాగా!"

"ఏం చెప్పావురా?" పెద్దన్నయ్య కూడా గిద్దిస్తున్నాడు.

"చెప్పవేంరా! ఏం చెప్పావో చెప్పు!" అమ్మ చెవిని మరింత మెలిపెడుతూ అడిగింది.

చెప్పినా వీళ్లకు అర్థం కాదనుకున్నాడు రాము. 'వాడు మద్దిగాణ్ని నిర్దాక్షిణ్యంగా కొట్టాడనీ, ఇంతంత పలుగురాళ్ల మీద పడేసి వాణ్ని ఈడ్చాడని' చెప్పాడుగా ఇంతకుముందే.

# తొలిచావు

అమ్మ చెవి వదిలేసి లెంపకాయ కొడుతూ అడిగింది.

"మద్దిగాడు నీకేమౌతాడ్రా?" అని.

"ఈ వెధవల్తో ఆడీ ఆడీ అన్నీ పాడల వాట్లు చేసుకుంటున్నాడు..." పెద్దన్నయ్య పురి వేస్తున్నాడు మధ్యలో.

"ఎన్నిసార్లు చెప్పానురా నీకు? ఆ బిచ్చపు వెధవల్తో ఆడుకోవద్దని. వాళ్ల పంచన చేరందే నిద్ర పడితేనా! మొండివెధవ.." మరో చెంపను చెళ్లుమనిపించింది అమ్మ. రాము కళ్ల నుంచి నిప్పులు కురిసినట్లయింది. శరీరంలో ఉన్న రక్తమంతా ముఖంలోకి చేరిపోయి, ముఖం ఎర్రగా కందగడ్డ అయిపోయింది. చెంపల్లో మంచి మంట లెగుస్తున్నాయనిపించింది రాముకు. కళ్లు తడి అయినాయిగాని ఏడవలేదు.

"ఎప్పుడు చూసినా ఆ శ్మశానంలోనేనయ్యె ఇప్పుడే ఇలాగైతే ఇంక పెద్దయ్యాక ఎవన చేతిలో ఉంటాడా అని!" మరోసారి చెంప చెళ్లుమన్నది అయితే ఈసారి రాముకు కళ్లు తిరుగలేదు. ఇందాకా ముఖంలోకి చేరి గడ్డ కట్టుకున్న రక్తమంతా క్రమంగా తిరిగి శరీరమంతటా వ్యాపిస్తున్నట్లనిపించింది శరీరంలో శక్తి పెరుగుతున్నట్లనిపించింది. మరో దెబ్బను ఎదుర్కోడానికని తల విదుల్చుకుని చెయ్యెత్తి పైకి చూసేసరికి తన్ను కొట్టడానికని ఎత్తిన అమ్మ చెయ్యి ప్రత్యక్షమైంది. మనసులో మరో బొమ్మ మెరసింది. తెల్లతెల్ల కంకర రాళ్ల మీది నుంచి ఈడ్వబడుతూ, గుడ్డలు చిరిగిపోయి, రక్తం కారుతూ ఏడుస్తూ వున్న కుర్రాడి బొమ్మ అది చెప్పుదెబ్బలు తప్పించుకోవడానికి పాపం వాడు పదేపదే చేతు లెత్తుతూనే వున్నాడు.

రాము ఒక్కడుగు వెనక్కి వేశాడు. అమ్మ వాడి కుడి చెయ్యి దొరక పుచ్చుకుంది.

"ఎక్కడికిరా పారిపోతావు? చెప్పు! మళ్లీ ఇలాంటి పని చేస్తావా?"

రాము గట్టిగా చేతిని విదిలించుకుని "ఛీ" అంటూ వరండా వైపుకు తుర్రుమన్నాడు.

"ఆ ఏమన్నావు? ఎదిరిస్తున్నావా వెధవ" రామును పట్టుకోవడానికి అమ్మ ఒక్కడుగు ముందుకు వేసింది. వాడు దొరకలేదు. ఇక వాడి వెంట పరుగు పెట్టడం తన కెల్లాగూ సాధ్యం కాదనుకుని కాలికున్న చెప్పును వాడి వైపుకు బలంగా విసిరేసింది. వరండా దాటాడో లేదో చెప్పు వెళ్లి రాము తలమీద తగిలి క్రింద పడ్డది వాడక్కడే ఆగిపోయాడు. రెండు లెంప కాయలు చెయ్యలేని పని ఒక్క చెప్పుదెబ్బ" చేసి చూపెట్టింది రాము కళ్లనుంచి కన్నీళ్లు కట్టలు తెగి ప్రవహించసాగినయి.

కాసేపటికి రాము నాన్నగారు ఇంట్లో ప్రవేశించారు. నెక్ టై వదులు చేసుకుంటూ, కోటు గుండీలు విప్పుకుంటూ రోజులాగే సరాసరి లోపలికి వెళ్లిపోయారాయన. నాయనమ్మ మంచం మీద కూచుని తడక సందుల్లోంచి నాన్నను చూశాడు రాము. ఆయన కనుచూపు మేర దాటిపోయ్యాక చెవులు రిక్కరించి లోపల అవుతున్న శబ్దాలు విన సాగాడు. బూట్లు విప్పిన ధ్వని, పుక్కిలించి ఉమ్మేసిన ధ్వని, కాళ్లు కడుక్కున్న ధ్వని, అమ్మతో మాట్లాడు తున్న ధ్వని, ప్లేట్లు పరచిన ధ్వని, గిన్నెలోంచి ఫలహారం తీసి అమ్మ ప్లేట్లో పెట్టిన ధ్వని, ప్లేటు తీసుకొని నాన్నగారు కూచుని ఫలహారం చేసే చోటికి అమ్మ వెళ్లిన ధ్వని—

మళ్లీ చేతులు కడుక్కుని, పుక్కిలించి ఉమ్మేసిన ధ్వని కూడా విన్నాక ఇక రాము అక్కడ ఉండలేక పోయ్యాడు. మెల్లగా అడుగులో అడుగు వేసు కుంటూ లోపలి వేపుకు దారి తీశాడు. నాయనమ్మ "హు" అంటూ చేసిన హెచ్చరికకు ఒక్కనిమిషం ఆగాడు కాని, దాని అర్థం బోధపడక మళ్లీ నడక సాగించాడు. లోపరికి చేరాడు. మెల్లగా పిల్లికూన లాగ వంటింట్లోకి చేరాడు.

"ఎందుకొచ్చావిక్కడికి?" అమ్మ కోపంగా ప్రశ్నించింది.

"ఆకలమ్మా!"

"ఆకలా? అసలు నీకి పూట పస్తు! చెప్పాగా!"

"బాగా ఆకలేస్తున్నదమ్మా!" దీనంగా ప్రార్థించాడు.

"ఏమైనాసరే, ఇవాళ నువ్వు అలా ఆకలితో ఏడాల్సిందే నీకిదే శిక్ష."


"సంగతేమిటసలు" పెరట్లో పచార్లు చేస్తున్న నాన్న అడిగారు. ఆయన గొంతులో మామూలుగా ఉండే గర్జన అయితే వుందిగాని, కోపం కత్తుల ఝుళిపింపులులేవు. నాన్న అంత చెడ్డవాడు కాదు .. అమ్మ అనవసరంగానే నాన్న పేరు చెప్పి తన్ను బెదిరిస్తుందికాని." అనుకున్నాడు రాము.

"చూడు నాన్నా! అమ్మ అన్నం పెట్టనంటూ వుంది!" అన్నాడు గోముగా.

"నా మీద చాడీలు చెప్పడానికి బయల్దేరాడన్న మాట. తాను చేసిన ఘనకార్యాన్ని కూడా చెప్పమనండ మరి!"

"అసలేం జరిగింది?"

"చూడు నాన్నా ." అంటూ పచార్లు చేస్తున్న నాన్న అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తూ చెప్పసాగాడు రాము.



"ఆ అయిలుగాడులేడు నాన్నా!...ఆ అయిలు గాడేమో ."

"ఊ"

"ఆ అయిలుగాడు మద్దిగాణ్ని కొట్టాడు నాన్నా!"

"ఎందుకని?"

"మరేమో వాడికి మద్దిగాడు పదిరూపాయలు బాకీ అంట నాన్నా!"

"ఈ యానాది వెధవలకు ఎప్పుడూ తగువులే!"

"అవును నాన్నా.. పాపం ఆ మద్దిగాణ్ని వీడు కంకరరాళ్ల మీద పడేసి చెప్పుతో కొడుతూ లాగాడు నాన్నా!"

"ఆ!"

"రామాయణమంతా చెపుతాడే కాని తాను చేసింది చెప్పడేం?"

"ఏం చేశాడేం మా చిట్టినాన్న!"

"ఏం చేశాడేమిటి? ఆ అయిలుగాడి తల పగుల గొట్టాడు." అమ్మ ఈ మాట అనగానే రాము ఎక్కడ నుంచున్నాడో అక్కడే ఆగిపోయాడు. పచార్లు చేస్తున్న నాన్న రెండడుగులు వేసి వెనక్కి తిరిగాడు.

"అయితే నువ్వు అయిలుగాడి తల పగులగొట్టా వన్నమాట."

రాము సమాధానం చెప్పలేదు. నాన్న గొంతులో కోపపు కత్తుల ఝుళిపింపు గోచరించింది.

"చెప్పవేం!" గర్జించాడు నాన్న.

ఈసారి కూడా రాము ఏమీ పలుకలేదు.

"పైగా వాడి మీదే చెప్పడానికి బయల్దేరావన్న మాట. వాడే కనుక ఎదురు తిరిగి నాలుగు పుచ్చుకుని వుంటే ఏమయ్యేది? నలుగురిలో మన పరువూ ప్రతిష్ఠా బూడిద పాలయ్యేదేనా? అగో.. వాడు మద్దిగాణ్ని కొడితే నీకేం? చీలిస్తే నీకేం? వాళ్లూ వాళ్లూ తన్నుకుని చస్తే మధ్య నీకెందుకూ అంట! వేలెడంత లేవుగాని ఇన్ని విపరీతపు బుద్ధులా?"

"నేననేది అదేనండి. ఇప్పటినుంచే బుద్ధి చెప్పక పోతే వీడిక మన చేతికొస్తాడా అని! అందుకే ఈపూట పస్తు పడుకో బెట్టాలనుకున్నాను."

"ఒక్కపూట తిండి లేనంతలో వీడి కావరం వంగుతుందా? గోడ కుర్చీ వేయించాలి! పదరా పద! గోడ కుర్చీ వెయ్యి!"

రాము తాను నుంచున్న స్థానం నుంచి కదలక పోయేసరికి నాన్న కంఠం వేల మేఘాలు ఒక్కసారి గర్జించినట్లు గర్జించింది. "కదులుతావా లేదా?" అంటూ. రాము కంపించిపోయాడు. బిక్కుబిక్కు మంటూ వెళ్లి వరండా గోడకు గోడకుర్చీ వేశాడు.

దీపాలు వెలిగాయి. నాయనమ్మ తప్ప అంతా భోజనాలు చేశారు. సాయంకాలం పూట నాయనమ్మ భోజనం చెయ్యదు. అమ్మానాన్నా వాళ్ళ గదుల్లోకి వెళ్లిపోయారు. రాము మాత్రం అలాగే గోడకుర్చీలో ఉండిపోయాడు. చేతులు కాళ్లు లాగుతున్నాయి. నడుం నొప్పి పుడుతూ వుంది. ముఖం కందగడ్డ యింది. చెవుల్లో మంటలు మండిపోతున్నాయి. రాము అంతస్సులో ఉన్న ఏదో వస్తువు దాన్ని ఆత్మాభి మానం అంటారో వ్యక్తిత్వం అంటారో రాముకు తెలియదుగాని ధనుస్సు లాగా వంగి బిర్ర బిగుసుకుని పోయినట్లయింది. తాను తప్పు చెయ్యలేదన్న ఆత్మ విశ్వాసం రాయిలా గడ్డ కట్టుకునిపోయి ఈ వంగిన ధనుస్సుకు ఆధారం అయింది మెల్లగా వంటింట్లోకి దూరి దొంగతనంగా ఏదేనా తినేద్దామని ఒకటి రెండు సార్లు అనిపించింది గాని, చెవుల్లో ఎవరో తన్ను హెచ్చరించినట్లయి ఆ ఆలోచనను విరమించుకున్నాడు.

ఆ చెవుల్లో చెప్పిన మాటలు ఇంకా గింగురుమం టూనే వున్నాయి. "ఔను—నీపట్ల అన్యాయం జరుగుతోంది, అక్రమం జరుగుతుంది, ఈ అక్ర మాన్ని ఎలాగైనా ఎదుర్కో... కాని దొంగతనంగా మాత్రం వద్దు." అని. అవును దొంగతనంగా వెళితే నాయనమ్మ ఏమనుకుంటుంది. ఇదంతా చూస్తూ నాయనమ్మ ఎందుకలా నోరు మూసుకొని కూచు న్నది? ఏమి తలపోస్తూ వున్నదో!

కాని మరోవైపు కడుపులో ఎలుకలు పరుగు తీస్తున్నాయి. ఏదో శక్తి తన్ను తన అంతస్సును పళ్లతో కొరుకుతున్నట్లనిపించింది. ఈ శక్తి అంతకు ముందు వరకూ గడ్డ కట్టుకునిపోయి ఉన్న దాన్ని కరిగించి వేసింది. ఆ కరగడం కరగడం అదంతా కన్నీరై కళ్ల గుండా ప్రవహించసాగింది.

నాయనమ్మ మెల్లగా తన మంచం మీదినుంచి లేచి, గోడకు కుర్చీ వేసుకుని వున్న తన ఎద్దకి వచ్చింది. మొదట తన తలను నిమిరింది అరచేత్తో. గోడకుర్చీలో నుంచి లేపి చక్కగా నుంచోబెట్టింది. కాళ్ళు తడబడితే తన చేతిని ఆసరా ఇచ్చి సాయ పడ్డది. హృదయానికి హత్తుకుని ఓదార్చింది.

"బాగా ఆకలేస్తుంది నాయనమ్మా!"

"నాకు తెలుసునాన్నా. పో.. మా నాయనగదూ! వెళ్లి నాన్న దగ్గరి కెళ్లి క్షమాపణ వేడుకో. పోనాన్నా, వాడు తప్పక క్షమిస్తాడు."

"క్షమాపణా?.. ఎందుకు?.. నాయనమ్మా!.."

"కాదు నాన్నా! నాకంతా తెలుసు గదా! మరి అన్నం దొరకదుగా! ఓ వైపు ఆకలి, మరో వైపు ఈ గోడకుర్చీ..."

రాము తల తిరిగిపోయింది. తన అంతస్సులో గడ్డ కట్టుకుని వున్న ఆ వస్తువు ఎప్పుడు కరిగిపోయి జాడ లేకుండా మాయమైపోయింది. మెల్లగా, కాళ్లీడ్చుకుంటూ నాన్న గది తలుపుల దాకా వెళ్లాడు. లోపల నాన్నగారు మెళకువతో ఉన్న అలికిడి విన పడుతూనే వున్నది. మెల్లగా తలుపు ప్రక్కనచేరి "నాన్నా! నన్ను క్షమించండి నాన్నా! ఇకనుంచి తప్పుడు పనులేమీ చెయ్యను నాన్నా!" చివరి మాట అంటూ ఉండగా రాము అంతస్సులో ధనుస్సు ఆకారంతో వంగి బిగుసుకుపోయిన ఆ వస్తువేదో ఫడేల్న విరిగిపోయి కళ్లలో నుంచి దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవహించింది. ●

